క్లుప్తంగా

23న ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

నాదెండ్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కొత్త పనులు నిర్వహించుకునేందుకు ఈనెల 23న అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందన్నారు. గ్రామాల్లో నూతనంగా తీసుకోబోయే పనుల గురించి ఆమోదం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పథకం పనులు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన గోకులం షెడ్లు, హార్టికల్చర్, ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ వర్క్‌లకు సంబంధించి గ్రామసభల్లో వివరించి సర్పంచ్‌ల ఆమోదం తీసుకోవాలన్నారు.

రైతు ఆత్మహత్యపై క్షేత్రస్థాయి విచారణ

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్లలో గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన మోటపోతుల వెంకటేశ్వర్లు ఇంటిని ముగ్గురు సభ్యుల కమిటీ బృందం సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు అప్పుల బాధ తాళలేక పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. తహసీల్దార్ ఎ.వి. సుధాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ, వ్యవసాయాధికారి ఎ. అంకారావులు గ్రామంలో కుటుంబ సభ్యులను, ఇతరుల నుంచి ఆత్మహత్యకు సంబంధించి వివరాలు సేకరించారు. రైతు పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన విషయంపై విచారించి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని ఈ మేరకు తహసీల్దార్ తెలిపారు.

ఇంటింటికీ కుళాయిపై పల్స్ సర్వే

బొల్లాపల్లి: ఇంటింటికీ కుళాయి అమలు విధానంలో భాగంగా సోమవారం సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పల్స్ సర్వే నిర్వహించారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో జలజీవన్‌మిషన్ ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీటిని కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకం అమలులోకి తెచ్చింది. ఈ పథకం అమలు తీరుపై పల్స్ సర్వే చేపట్టామని ఎంపీడీవో షేక్ గౌసియా బేగం తెలిపారు. ఆయా గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించడంలో భాగంగా పథకం అమలు తీరు క్షేత్రస్థాయిలో పల్స్ సర్వే నిర్వహించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

కంప్యూటర్ బహూకరణ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని సీతారామపురం పాఠశాలకు చిలకలూరిపేటకు చెందిన పాపసాని అంజిబాబు కంప్యూటర్‌ను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిష్లా కామేశ్వరరావు శర్మ మాట్లాడుతూ కంప్యూటర్‌ను బహుకరించిన దాతకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ జి. విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామపంచాయతీ ఎంపీపీ స్కూల్‌లో డయేరియా పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం పర్వీన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, ఎస్.అంజనీకుమారి, అంగన్‌వాడీ వర్కర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్లతోనే ప్రకృతి సమతుల్యత

చిలకలూరిపేట: ప్రకృతి సమతుల్యతకు చెట్ల పెంపకం ఎంతో అవసరమని మురికిపూడి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ అధికారి కె.రాజాబాబు చెప్పారు. వసతి గృహంలో చెట్ల పెంపకంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం చెట్టుకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థి చెట్ల పెంపకం చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనాటి దాని సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దాత గానుగపాటి మోహన్ బాబు అందించిన ఆర్థిక సహాయంతో విద్యార్థులకు బట్టలు, చెప్పులు అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పండరీపురం, సింగ్ నగర్, సుగాలీకాలనీ, ఎన్ఆర్‌టీ సెంటర్, పోలిరెడ్డిపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, కుమ్మరికాలనీ, మదర్ థెరిస్సా కాలనీ ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ ఉండదన్నారు. అలాగే గుండయ్య తోట, ఆవులదొడ్డి ప్రాంతాలలో సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రావడం-వెళ్లడం అంతా వాళ్లిష్టం!

- పనివేళల్లో కార్యాలయం మూత
- అందుబాటులో లేని అధికారులు, సిబ్బంది
- విద్యాశాఖ పనితీరుకు ఇదే నిదర్శనమంటూ స్థానికుల గగ్గోలు



కార్యాలయ వేళల్లో తెరుచుకోని మండల వనరుల కేంద్రం

బొల్లాపల్లి : మండల వనరుల కేంద్రం పనివేళల్లో తలుపులకు తాళాలు దర్శనమిస్తున్నాయి. విద్యాశాఖకు సంబంధించి మండల కేంద్రంలో విద్యాశాఖ ప్రధాన కార్యాలయం మండల వనరుల కేంద్రం. అయితే ఈ శాఖకు సంబంధించి తరచుగా సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండాల్సింది. వీరెవరూ అందుబాటులో లేకపోవడంతో తలుపులకు తాళాలు వేసి ఉంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంఈవో-1 సయ్యద్ జఫ్రుల్లా ఇన్‌చార్జిగా, ఎంఈవో -2 కె.పార్వతిలు రెగ్యులర్‌గా, సిబ్బంది ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్‌లు కార్యాలయంలో అందుబాటులో ఉండాలి. కానీ వీరిలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తలుపులకు తాళాలువేసి ఉండటంతో ఏదైన పని నిమిత్తం వచ్చిన వారు వెను తిరుగుతున్నారు. పని నిమిత్తం వస్తే తలుపులకు తాళాలు వేసి ఉంటున్నాయని, ఇది విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమని వాపోతున్నారు. ఆఫీస్ వేళల్లో కార్యాలయం తెరిచి ఉండటంతో పాటు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నయ్య సన్నిధి.. అదేనాకు పెన్నిధి..

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ మహిళా క్యాడెట్స్ తోటి క్యాడెట్స్‌కు రాఖీలు కట్టి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకరినొకరు సోదరభావంతో మెలగాలని తెలిపారు. సీనియర్ క్యాడెట్స్ అధికారం కోసం కాకుండా బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్, క్యాడెట్స్ పాల్గొన్నారు.

రాఖీలు కట్టిన బ్రహ్మకుమారి సభ్యులు

నరసరావుపేట: పవిత్ర రాఖీ పౌర్ణమి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ఆయన గృహంలో ప్రజాపిత బ్రహ్మకుమారి సమాజం సభ్యులు రాఖీకట్టి ఆశీర్వచనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి సమాజం సభ్యులు, నియోజకవర్గ ప్రజలకు గోపిరెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: తోబుట్టువుల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ మండలంలో సోమవారం అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సోదరులకు వారి సోదరీమణులు రాఖీలు కట్టి దీవెనలు పొందారు. అనంతరం సోదరులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వివిధ ఆకృతుల్లో రాఖీల దుకాణాలు కిటకిటలాడాయి. స్వీట్ల దుకాణాల్లో రద్దీ కనిపించింది. గణపవరంలోనూ రాఖీ పండుగ సందడిగా సాగింది. తమ తోబుట్టువులకు రాఖీలు కట్టి వారి నుంచి ఆశీస్సులు పొందారు.



మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సమాజ సభ్యులు



రొంపిచర్లలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో సోమవారం రాఖీ పౌర్ణమి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముల ప్రేమకు ప్రతీకగా ఈ పండుగ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాలలో అన్ని దుకాణాలలో రకరకాలుగా రాఖీలు ఆకట్టుకున్నాయి. సోదరీమణులు తమ సోదరుల ఇళ్ళకు వెళ్లి వారికి రాఖీలు కట్టి తమ సోదరప్రేమ చాటుకున్నారు. ఈ విధంగా రాఖీలు కట్టిన సోదరీమణులకు సోదరులు ఆప్యాయంగా పలకరించి వారికి నగదు, వస్తు రూపంలో బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పక్కన గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.



రాఖీలు కడుతున్న మహిళా ఎన్‌సీసీ క్యాడెట్స్



గణపవరంలో అన్నకు రాఖీ కడుతున్న సోదరి

రిక్రియేషన్ హాలుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, ఉద్యోగ సంఘాల నాయకులు

నరసరావుపేట: తమ ప్రభుత్వం ఉద్యోగులందరికీ అన్నీ విషయాలలో సహకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సోమవారం ఎన్‌జీవో హోంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించే రిక్రియేషన్ హాలు శంకుస్థాపనకు ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు తన మద్దతు కూడా ఉంటుందన్నారు. తమ వంతు సాయంగా రిక్రియేషన్ హాల్ నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. నిర్మాణానికి తమ సహకారం పూర్తిగా అందిస్తానని హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా అసోసియేషన్ రూ.1 లక్ష, గురజాల, సత్తెనపల్లి, వినుకొండ యూనిట్‌లు రూ.1 లక్ష చొప్పున ప్రకటించగా, వినుకొండ, బాపట్ల, తెనాలి యూనిట్లు రూ.50 వేలు చొప్పున విరాళం ప్రకటించాయి. జిల్లా, తాలూకాలకు చెందిన కార్యవర్గ సభ్యులు తమ విరాళాలను ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్, పశ్చిమ కృష్ణ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, తాలూకా అధ్యక్షులు ఎం.రామకృష్ణ, కార్యదర్శి ఎం.ఆనంద్ నాథ్, ట్రెజరర్ కోటిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ రామాంజనేయరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవికుమార్, డీవీడి ప్రసాద్, శ్యామల, మాణిక్యమ్మ, మహిళా వింగ్ చైర్మన్ టి.అనురాధ, నరసరావుపేట తాలూకా కార్యవర్గం, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలి

నరసరావుపేటరూరల్: పరిశుభ్రమైన వాతావరణంలోనే ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని చినతురకపాలెంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. డ్రైయిన్‌లోని వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి ఉండడం ద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. నీరుని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడియాల రమేష్‌బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు కేసు ఎత్తివేయాలంటూ ధర్నా

- కలెక్టరేట్ ముందు కేఎన్‌పీఎస్ నాయకుల నిరసన
- ఎస్పీకి వినతిపత్రం



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు, బాధితులు

నరసరావుపేట: సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం కొంకావారిపాలెంకు చెందిన 13 మంది మాదిగలపై పెట్టిన తప్పుడు కేసును రద్దుచేసి యాక్సిడెంట్ చేసి ముగ్గురు పిల్లలు గల మహిళ మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కన్వీనర్ కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేసి జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన తురకపాలెం గ్రామానికి చెందిన నాగోతు హృదయరాజు కూలి పనుల కోసం కూలీలను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌తో వచ్చాడని, శిరిగిరి బుజ్జి భార్య కృపావతి, నాగేంద్రం, శాంతమ్మ, ప్రవళికలను ఎక్కించుకొని వెళ్లాడన్నారు. తురకపాలెం-దమ్మాలపాడు రోడ్డులో ట్రాక్టర్ తిరగబడటంతో కృపావతి ట్రాక్టర్ చక్రాల కింద పడి నలిగి దుర్మరణం చెందగా మిగతా వారు గాయపడ్డారన్నారు. భర్త బుజ్జి ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని చెప్పారు. అయితే యాక్సిడెంట్ చేసిన హృదయరాజును మాత్రం పోలీసులు పట్టించుకోలేదన్నారు. మృతదేహంతో పోలీసు స్టేషన్‌కు వెళ్లి యాక్సిడెంట్‌కు కారకుడైన హృదయ రాజును అరెస్టుచేయాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని దళితులు శాంతంగానే కోరారన్నారు. తప్పకుండా న్యాయం చేస్తామని ఎస్ఐ ఇచ్చిన హామీతో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారన్నారు. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా హృదయరాజు అరెస్టు జరగలేదని, చార్జిషీటు దాఖలు చేయలేదన్నారు. ఆ రోజున స్టేషన్‌కు వెళ్లిన వారిలో 13 మంది దళితులపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇటీవల వరకు రహస్యంగా ఉంచి ఇప్పుడు స్టేషన్‌కు వచ్చి బెయిలు తీసుకోవాలని చెబుతున్నారన్నారు. అన్యాయం జరిగిన వారికి ఇప్పటి వరకు న్యాయం జరగకపోగా దళితులపై తప్పుడు కేసు మాత్రం పెట్టి వేధిస్తున్నారన్నారు. వెంటనే ఆ కేసును రద్దుచేసి ట్రాక్టర్ ప్రమాదం చేసి ముగ్గురు పిల్లల తల్లి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టుచేసి చట్టాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో దళితులు బుజ్జి, దానియేలు, శౌరయ్య, బాబు, సాంబయ్య, తాతీలు, చిన్న అంతయ్య, మాణిక్యాలరావు, రాయన్న, స్వామియేలు పాల్గొన్నారు.

యువకుడి ఉసురు తీసిన క్షణికావేశం



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

బొల్లాపల్లి: నాగార్జునసాగర్ ప్రధాన కుడికాలువలో యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. బండ్లమోటు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రావులాపురం గ్రామానికి చెందిన యలగాల వెంకటేశ్వర్లు (20) క్షణికావేశంలో కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 17వ తారీకు రాత్రి బస్సులో వినుకొండ నుంచి రావులాపురం వెళ్తూ మార్గమధ్యంలోని ముగచింతలపాలెం వద్ద ఉన్న కాలువలో దూకినట్లు మృతుడి తండ్రి యలగాల మన్నెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. రెండు రోజుల పాటు కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మండలంలోని సంగినీడుపాలెం సీతారామపురం తండా పరిసర ప్రాంతంలోని ఎన్ఎస్‌పీ కుడి కాలువలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. యలగాల మన్నెయ్యకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. వీరిలో కుమారుడు వెంకటేశ్వర్లు మృతితో కుటుంబం రోదనలు మిన్నంటాయి. కుటుంబానికి ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటున్నాడని, వినుకొండ పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అంకాలమ్మ తల్లి దేవస్థాన వార్షికోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో గల అంకాలమ్మ తల్లి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఎం.సాయిబాబా ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం 6వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లాయర్ పోట్లూరి సైదారావు, ల్యాబ్ శ్రీనివాసరావు, సూదేపల్లి శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ జొరిగె శంకరరావు, వాసిరెడ్డి పాపారావు, సత్యనారాయణ, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

కలుపు, చీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ పాటించాలి

- రైతులకు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు
- రెండు గ్రామాల్లో పొలాల పర్యటన



రైతులకు సూచనలు ఇస్తున్న డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ

నాదెండ్ల: యడ్లపాడు మండలం తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో సోమవారం రైతు శిక్షణా కేంద్రం అధికారులు సందర్శించారు. పత్తి, కంది, మినుము పంటలను పరిశీలించారు. డీడీఏ శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో సరిత రైతులకు సూచనలు చేశారు. కంది సాగులో కలుపు సమస్య ఉన్నదని తెలుసుకుని ఇమాజితాపిర్ యకరాకు 300 ఎంఎల్ చొప్పున పిచికారీ చేసినట్లయితే కలుపు నివారించుకోవచ్చన్నారు. ప్రస్తుతం పత్తి పైరు 45 రోజుల దశలో ఉన్నందున ప్రస్తుతం రసం పీల్చు పురుగు నివారణకు వేప సంబంధిత మందులు లీటరు నీటికి 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. అర్తీన్, నువాక్రన్ కలిపి వినియోగించాలన్నారు. 60 రోజుల పంట దాటినట్లయితే వినియోగించవలసిన అవసరం లేదన్నారు. 45 రోజుల వయస్సున్న పత్తి పంటలో ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను వినియోగించుకుని గులాబీరంగు పురుగు ఉనికి గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రైతులకు ట్రైకోడెర్మా కల్చర్ తయారీ విధానాన్ని వివరించారు. 100 కేజీల ట్రైకో డెర్మాకల్చర్‌కు 90 కేజీల పశువు ఎరువు, పది కేజీల వేపపిండి, రెండు కేజీల టీవీడీ కలిపి చెట్టు నీడలో 15 రోజులు ఉంచి ఆతర్వాత పొలంలో చల్లుకున్నట్లయితే చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోల్‌కత్తా దోషులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ వద్ద నుంచి చౌత్రాసెంటర్, మెయిన్‌బజార్, కళామందిర్ సెంటర్, గడియార స్తంభం సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రాజమోహనరావు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు సమాజంలో ఎక్కడో ఒకచోట జరుగుతునే ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో మన బిడ్డలు స్వేచ్ఛగా బయట ఎలా తిరగగలరని ప్రశ్నించారు. అన్ని సంస్థల్లో మహిళలు, యువతులకు అవసరమైన భద్రతా చర్యలు ప్రభుత్వాలు చేపట్టాలని కోరారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన కొత్త చట్టాలు రూపొందించి వాటిని కఠినంగా అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి బి.భగత్‌సింగ్, నాయకులు మేకపోతుల నాగేశ్వరరావు, టి.డాని, ఎం.సాయినాయక్, ఎ.శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ...

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ మౌమితపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఏఐవైఎఫ్, ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని కొనకంచి వారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రివేళల్లో ఆలయంలో భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

శభాష్.. కానిస్టేబుళ్లు!

తోటి కానిస్టేబుల్ కుటుంబానికి సహచరులు నగదు సాయం

అభినందించిన ఎస్పీ



నరసరావుపేట: విధి నిర్వహణలో మృతిచెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు తోటి బ్యాచ్ పోలీసుల ఆర్థిక చేయూత అందజేయటం అభినందనీయమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కానిస్టేబుల్ ఇ.పవన్‌కుమార్ ప్రకాశం జిల్లా తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ గుంటూరు జిల్లా తుళ్లూరు పరిధిలో బందోబస్తు విధులు నిర్వహిస్తూ 2023 మే 24న పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. 2012 బ్యాచ్‌కు చెందిన తోటి ఉమ్మడి గుంటూరు జిల్లా పోలీసులు తమ వంతు సాయంగా సేకరించిన రూ.1.10 లక్షల నగదును ఎస్పీ చేతుల మీదుగా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు.

భూ బాధితులకు అండగా ఉంటాం

28న విజయవాడలో రాష్ట్రవ్యాప్త సదస్సు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య



నరసరావుపేట: పేదల భూములు మళ్లీ వారికి చెందే విధంగా సీపీఐ పార్టీ వారికి అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ వద్ద నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. పెద్ద మనుషుల పేరుతో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, రాజకీయ నాయకుల ముసుగులో ఉన్నవారు ఎకరాలకు ఎకరాలు దోచుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉన్నటు వంటి రెవెన్యూ భూ బాధితుల, రాజకీయ రాబందుల భూ బాధితుల అఖిలపక్ష సదస్సు ఈనెల 28 తేదీన విజయవాడలో నిర్వహించి పేదలు, రైతులు, భూ బాధితుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి రాయబారిగా సీపీఐ నిర్వహిస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ. మారుతి వరప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కాసారాంబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుదాల శ్రీనివాసరావు, సత్యనారాయణరాజు, తాళ్లూరు బాబురావు, ఉప్పలపాటి రంగయ్య, దాసరి వరహాలు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రకటన

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీ.పీ.సీ.ఎల్) సర్వే నెం. 67/సి1బి1 (డోర్ నెం. 7 408) వద్ద ఒక రిటైల్ అవుట్ లెట్‌ను ఏర్పాటు చేయాలని భారత్ పెట్రోలియం ప్రతిపాదిస్తుంది. టీవీకి గాను చిలకలూరిపేట మున్సిపాలిటీలోని చిలకలూరిపేట పట్టణ పల్నాడు జిల్లాలోని ప్రాసెస్ డీవర్స్ సంస్థ తరపున మేనేజింగ్ డైరెక్టర్ విడదల వేణుగోపీనాథ్, తండ్రి లక్ష్మీనారాయణ గారి స్థలం సర్వే నెం.67/సి1బి1 (డోర్ నెం.7 408) ఈ సంస్థ నుండి 670.చ.మీ. హద్దులు : తూర్పు: కూర్మాల కిరణ్ కుమార్, కూర్మాల విజయ్ కుమార్‌ల స్థలం. పడమర: పొట్టి సీతాంజనేయులు వగైరాల ఆస్తి హద్దు. దక్షిణం: విడదల వేణుగోపీనాథ్ తాలూకు ఖాళీ స్థలం. ఉత్తరం : చిలకలూరిపేట-చీరాల రోడ్డు హద్దు.
పైన వ్యక్తి లేదా సంస్థ (వ్యవస్థీకృతమైన లేదా అసంఘటితమైనది) పేర్కొన్న ఆస్తిపై ఏ పద్ధతిలోనైనా ఏదైనా హక్కు కలిగి ఉంటే ఈ రోజు నుండి 10 రోజులలో వారి క్లెయిమ్‌కు మద్దతు ఇవ్వడానికి సంబంధిత ఏదైనా అవసరమైన లిఖిత పత్రాలతో పాటు దిగువ పేర్కొన్న వారికి తెలియజేయవచ్చును. సంప్రదింపుల కోసం:

టెరిటరీ మేనేజర్ (రిటైల్) విజయవాడ
భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
కొండపల్లి డిపో (లాప్). చినపాల గ్రామం మరియు పోస్టు
విజయవాడ- 521228, ఆంధ్రప్రదేశ్. సెల్ : 9440284138.